క్లుప్తంగా

టీడీపీ నేతలకు ప్రజలే బుద్ధి చెబుతారు

కాజులూరు: తెలుగుదేశం పార్టీ నాయకుల మోసాలకు త్వరలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి యాళ్ల సత్తిబాబు అన్నారు. గొల్లపాలెంలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్‌సిక్స్ పేరుతో ఎన్నికల్లో ఎన్నో తప్పుడు వాగ్దానాలు చేసిన కూటమి నేతలు ఏ ఒక్కటి పూర్తిగా అమలు చెయ్యకుండా అన్నివర్గాల ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. పథకాల అమలుపై ఉన్న ప్రజావ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు రెడ్‌బుక్ పేరుతో వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి సోషల్ మీడియాలో హడావుడి చేస్తున్నారన్నారు. ఈ అవినీతి ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో మండల సేవాదళ్ అధ్యక్షుడు పాలిక వీరబాబు, చందాల దుర్గాప్రసాద్, నిమ్మితి విజయ్, దళిత సంఘం నాయకులు కుమారస్వామి, బీసీ నాయకులు పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు తామరపల్లిలో ఉచిత వైద్య శిబిరం

కె.గంగవరం: మండల పరిధిలోని తామరపల్లిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన గోలి సూర్యనారాయణ, రామసీత దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఊపిరితిత్తుల వైద్య నిపుణులు గోలి మాణిక్యవెంకట కాశీరామ్, కిడ్నీ స్పెషలిస్ట్ బెల్లంకొండ రాజశేఖర్ తదితర వైద్యులు రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారన్నారు. గ్రామస్తులతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీఎల్‌ఓలకు రేపు శిక్షణ

కపిలేశ్వరపురం (మండపేట): జాతీయ, రాష్ట్రీయ ఎన్నికల కమిషనర్ల ఆదేశాలపై సోమవారం రాయవరం మండలంలోని 45 మంది బీఎల్‌ఓలకు పలు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు మండపేట నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కృష్ణమూర్తి శనివారం తెలిపారు. ఇటీవల మాస్టర్ ట్రైనర్ నాగం నాగ శివ, ఏడిద సచివాలయం 1 వెల్ఫేర్ అసిస్టెంట్లు న్యూ ఢిల్లీలో శిక్షణ పొందారని శిక్షణ అంశాలపై బూత్ లెవెల్ అధికారులకు అవగాహన తరగతులు నిర్వహించనున్నామన్నారు. అందులో భాగంగా రాయవరం ఎంపీడీఓ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఒక రోజు శిక్షణ తరగతిని నిర్వహించనున్నామని కృష్ణమూర్తి తెలిపారు.

తాగునీరు వృథా


ద్రాక్షారామలో కుళాయి నుంచి వృథాగా పోతున్న మంచినీరు

రామచంద్రపురం రూరల్: మండలంలోనే మేజర్ పంచాయతీ ద్రాక్షారామలో తాగునీరు వృథాగా పోతోంది. జలజీవన్ మిషన్‌లో బిగించిన పైపు లైన్‌లకు కుళాయిలు బిగించాలని స్థానికులు కోరుతున్నారు. బిగించిన కుళాయిలు నాసిరకమో ఏంటో గానీ చాలా చోట్ల మంచినీరు వృథాగా పోతోందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం: నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు శనివారం రాజమహేంద్రవరానికి చెందిన భక్తుడు ఉయ్యూరు వీరవెంకటసత్యసుబ్బారావు రూ.27 వేలు వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు అందించారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాన్ని ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణ అందజేసి సత్కరించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో దాతకు ప్రత్యేక దర్శనం అందించారు.

మండపేట పీఏసీఎస్ చైర్మన్‌గా రామారావు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట వల్లూరి అప్పారావు పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా కుక్కల రామారావు, సభ్యులుగా పైడిమళ్ల డేవిడ్‌రాజు, పడాల జన్నయ్య ప్రమాణ స్వీకారం చేశారు. గుమ్మిలేరు రహదారిలోని సహకార సంఘం కార్యాలయంలో శనివారం సంబంధిత అధికారులు సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, ప్రస్తుత వైస్ చైర్మన్ పిల్లి గణేష్, కౌన్సిలర్లు, సహకార సంఘం సీఈఓ చర్ల సుబ్రహ్మణం, సిబ్బంది గంటి సుబ్రహ్మణ్యం, కుక్కల వేణు పాల్గొన్నారు.

పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

కపిలేశ్వరపురం: కాలేరు వ్యవసాయ సహకార సంఘం త్రిసభ్య కమిటీ సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. మండల పరిధి అచ్యుతాపురంలోని సహకార సంఘం కార్యాలయంలో అధికారుల సమక్షంలో చైర్మన్‌గా బోళ్ల గోవిందరాజు, సభ్యులుగా దాసరి శ్రీను, కురుపూడి శ్రీను ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ డీసీఎంఎస్ చైర్మన్ రెడ్డి ప్రసాద్, చుండ్రు రామకృష్ణ చౌదరి పాల్గొన్నారు.

నిండుకుండలా గోదావరి

- మరింత వరద పెరిగితే ముంపు ప్రమాదం
- వ్యవస్థలను నిర్వీర్యం చేసిన కూటమి ప్రభుత్వం
- బలహీనంగా నది గట్లు
- భయాందోళనలో లంక గ్రామాల ప్రజలు


కపిలేశ్వరపురం పుష్కర ఘాట్ వద్ద ఉరకలేస్తున్న గోదావరి

కపిలేశ్వరపురం: గౌతమి గోదావరి నిండు కుండను తలపిస్తోంది. నీటి ప్రవాహం ఉధృతంగా ఉరకలేస్తోంది. ఏటా వరద పరిస్థితి సహజమే అయినా వరద ప్రభావాలకు ప్రత్యక్షంగా నష్టపోయేది లంక గ్రామాల ప్రజలు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో అనేక గ్రామాలు వరదకు ప్రభావితమవుతాయి. గోదారి గట్లు బలహీనంగా ఉండటం ఆందోళనకు గురి చేస్తోంది. గోదావరి నదిలో ఉన్న లంక గ్రామాల ప్రజలు అప్రమత్తమవుతున్నారు. మరింత వరద పెరిగితే తమ పశువులను పరిరక్షించుకునేందుకు సమాయత్తమవుతున్నారు. గత వరద అనుభవాలను నెమరు వేసుకుంటూ ముందస్తు జాగ్రత్తలతో జీవిస్తున్నారు.

రెండు నియోజకవర్గాల్లో వరద ప్రభావం

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని పలు లంక గ్రామాలు పూర్తిగా గోదావరి నదిలో ఉన్నాయి. కపిలేశ్వరపురం మండలంలో అద్దంకివారిలంక, కేదారిలంక, కె.గంగవరం మండలంలో శేరిలంక మొత్తం మూడు గ్రామాలు ఏటా వరద ప్రభావానికి గురవుతాయి. అద్దంకివారిలంక గ్రామ పరిధిలో పల్లపులంక, అద్దంకివారిలంక, కోరుమిల్లి లంక, కేదారిలంక గ్రామ శివారులో వీధివారిలంక, కేదారిలంక, కపిలేశ్వరపురం గ్రామ పరిధిలో నారాయణలంక వరదల సమయంలో పెద్ద ఎత్తున నష్టపోతుంటాయి. ధవళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కాగానే ఆయా గ్రామాల పరిధిలోని వ్యవసాయ క్షేత్రాలకు వరదనీరు తాకుతుంది. రెండో ప్రమాద హెచ్చరిక రాగానే వ్యవసాయ క్షేత్రాలు మొత్తం ముంపుబారిన పడతాయి. పశువులను గ్రామాలకు తరలించుకుంటారు. మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన పరిస్థితుల్లో గ్రామాల్లోని నివాసిత ప్రాంతమంతా వరదనీటిలో తేలుతుంటాయి.

గత అనుభవాలిలా...

2014, 2016, 2018, 2019, 2020, 2022, 2023, 2024లో వరుసగా వరదలకు లంక గ్రామాలు ముంపుబారిన పడ్డాయి. 2018 ఆగస్టు వరదలకు కపిలేశ్వరపురం, నారాయణలంక, కేదారిలంక, వీధివారిలంక గ్రామాల పరిధిలో 126.93 హెక్టార్లు, తాతపూడిలో 27.94 హెక్టార్లు, కోరుమిల్లి, అద్దంకివారిలంక, పల్లపులంక గ్రామాల పరిధిలో 54.72 హెక్టార్లు, మండలం మొత్తంలో 646 మంది రైతులకు చెందిన 209.59 హెక్టార్లలోని అరటి, బొప్పాయి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. ఈ వరద ప్రభావానికి రూ.36,53,650 నష్టం వాటిల్లింది. 2019 ఆగస్టులో లంకల్లోని వ్యవసాయ క్షేత్రాలు, ఇటుక బట్టీలన్నీ ముంపుబారిన పడ్డాయి. తొగరపాయ వంతెన మునగడంతో లంక గ్రామాలకు ఇతర ప్రాంతాలతో రాకపోకలు తెగిపోయాయి. వీరవల్లిపాలెం రహదారి మునిగిపోవడంతో ఆర్టీసీ, ప్రైవేటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరికి ఎడమ భాగాన ఉన్న తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, శ్రీరాంపురం, వాకతిప్ప గ్రామాల పరిధిలోని ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. 2023 జూలై వరదల సమయంలో వ్యవసాయ క్షేత్రాలు ముంపుబారిన పడగా అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాడి పశువులకు దాణాను సరఫరా చేసింది. పశుసంవర్ధక శాఖాధికారులను లంక గ్రామాల్లోనే ఉండేలా ఆదేశాలిచ్చి సేవలందించింది.

కూటమి ప్రభుత్వంలో వ్యవస్థలు నిర్వీర్యం

వైఎస్ జగన్ హయాంలో వరదలను సమర్థవంతంగా ఎదుర్కోవడం వెనుక ఆయన తీసుకొచ్చిన వ్యవస్థలు కీలక పాత్రను పోషించాయి. ఆయన నెలకొల్పిన వలంటీర్, సచివాలయ వ్యవస్థలు వరదల సమయంలో విశేషంగా ఉపకరించాయి. 2022, 23లో సంభవించిన వరదల్లో సచివాలయ ఉద్యోగులు లంక గ్రామాల్లోనే ఉంటూ బాధితులకు సేవలందించారు. రాత్రింబవళ్లు గోదావరి గట్లను పరిశీలిస్తూ ఉన్నతాధికారులకు నివేదికలిచ్చేవారు. బాధిత ఇళ్లకు ఆహార పదార్థాలను, కూరగాయలను పడవలపై తీసుకెళ్లి ఇచ్చేవారు. వలంటీర్లు ఇంటింటికీ వాటర్ క్యాన్లు అందజేసేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వలంటీర్లను విధులకు దూరం చేసింది. సచివాలయ ఉద్యోగులపై పనిభారం పెంచి తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తోంది. వరదల సమయంలో లంక గ్రామాల ప్రజలకు ధైర్యం చెప్పే వ్యవస్థలంటూ ప్రత్యేకంగా లేని పరిస్థితి కూటమి ప్రభుత్వంలో నెలకొంది.

వైఎస్ జగన్ హయాంలో ముందస్తు చర్యలు

పటిష్టమైన వ్యవస్థలతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొంది. 2022, 2023లో ముందస్తు ప్రణాళిక, చిత్తశుద్ధితో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి వరదను సమర్థవంతంగా ఎదుర్కొంది. క్షేత్రస్థాయి పరిస్థితులపై నివేదికలను రప్పించుకుని ప్రణాళికను రూపొందించింది. ఏటిగట్ల పరిరక్షణతో పాటు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల వద్ద రక్షణ చర్యలు చేపట్టేది. గోదావరి గట్ల సమీపంలో ఫ్లడ్ స్టోర్లలో తగిన సామగ్రిని సమకూర్చేది.



2022 జూలైలో అద్దంకివారిలంకకు కూరగాయలను ప్యాకింగ్ చేసి పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు

ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి



వరద ఉధృతి మరింత పెరిగితే నియోజకవర్గంలో ముందస్తుగా పల్లపులంక గ్రామం ముంపుబారిన పడుతుంది. ఉద్యాన ఉత్పత్తులను, పాడి పశువులను కాపాడుకునేందుకు ప్రభుత్వం తగిన స్థాయిలో సహకరించాలి.

– సాకా శ్రీనివాస్, వైస్ ఎంపీపీ, అద్దంకివారిలంక, కపిలేశ్వరపురం మండలం

శాకంబరి నమోస్తుతే..


ద్రాక్షారామలో శాకంబరిగా అలరించిన గొల్ల మారెమ్మ తల్లి

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ క్షేత్రంలోని బెస్తాపేటలో వేంచేసిన గొల్ల మారెమ్మతల్లి శాకంబరిగా శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా అమ్మవారిని కాయగూరలు, ఆకు కూరలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఫిషర్ మెన్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

భానుడి భగభగలు


ఆర్యావటం-గొల్లపాలెం జంక్షన్‌లో నిర్మానుష్యంగా మారిన కాకినాడ- కోటిపల్లి రోడ్డు


గొల్లపాలెంలో నీరు లేక దమ్ములకు నోచుకోని వరిపొలం

- మండిపోతున్న ఎండలు
- వర్షాకాలంలోనూ కానరాని వరుణుడు
- కరెంట్ కోతలు, ఉక్కపోతతో ప్రజలు సతమతం

కాజులూరు: రుతులు గతులు తప్పుతున్నాయి. కాలాలు మారిపోతున్నాయి. నడి వర్షాకాలంలోనూ వరుణుడి జాడ కానరాకపోవటంతో ప్రచండ భానుడు విలయతాండవం చేస్తున్నాడు. రోజురోజుకూ సూర్యభగవానుడు నిప్పులు చెరుగుతుండటంతో ఎండ తాపానికి తట్టుకోలేక గ్రామాల్లోని ప్రజలు అల్లాడిపోతున్నారు. నియోజకవర్గంలో గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయి. శనివారం 38 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. గత దశాబ్ద కాలంగా ఎన్నడూ లేని విధంగా జూలైలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఉదయం పది గంటల నుంచే ఎండ తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు కూడా ఎండ తీవ్రత తగ్గడం లేదు. ఎండ వేడిమి భరించలేక వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉదయం 11 గంటలకే..

ప్రస్తుతం ఆషాఢమాసం కొనసాగుతోంది. ఆషాఢం, శ్రావణం మాసాలు వర్షాకాలానికి ప్రతీక. కాగా ప్రస్తుతం చెదురు మదురుగానైనా వర్షాలు పడకపోగా వేసవిలోని రోహిణి కార్తెను తలపించేలా ఎండలు మండిపోతున్నాయి. ఈ ఏడాది కాస్త ముందుగానే పలకరించిన నైరుతి రుతుపవనాలు జూలైలోనే మందగించాయి. ఉదయం 11 గంటలకే జన సంచారం లేక గ్రామీణ రహదారులు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. వ్యాపారులు షాపులు మూసివేస్తున్నారు. ఎండలకు తోడు వేళాపాలాలేని కరెంట్ కోతలు ప్రజలను తీవ్ర ఇక్కట్లకు గురి చేస్తున్నాయి. వృత్తి, వ్యాపార పనుల కోసం బయటకు వచ్చిన వారు మధ్యాహ్న సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరెంటు లేని సమయాల్లో ఉక్కపోత భరించలేక ఇండ్లలో నుంచి బయటకు వచ్చి అరుగులు, చెట్ల క్రింద కాలక్షేపం చెస్తున్నారు. ఎండతీవ్రత, కరెంటు కోతలతో ఇంటిలో ఉండలేక, బయటకు రాలేక ప్రజలు అపసోపాలు పడుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న కారణంగా రాత్రి సమయాల్లోనూ ఉక్కపోత ఎక్కువగానే ఉంటోంది.

రైతాంగానికి గడుకాలం

రోజురోజుకూ పెరుగతున్న ఎండలతో వ్యవసాయ రంగానికి క్లిష్ట పరిస్థితి నెలకొంది. అసలే పూడుకుపోయిన పంట కాలువలతో శివారు భూములకు సాగునీరందక రైతులు నానాఅవస్థలు పడుతున్నారు. వర్షాలు కురవకపోవటంతో రైతులు పూర్తిగా కాలువల నీటిపైనే ఆధారపడ్డారు. వంతుల వారీ విధానంతో అవస్థలు పడుతూ పంటచేలను తడుపుతుంటే ఎండవేడికి పొలాల్లో ఉన్న కొద్దిపాటి నీటిచుక్కలు ఆవిరైపోతున్నాయి. ఎండ తీవ్రతకు నీరు లేక పొలాలు బీటలు వారుతున్నాయని రైతన్నలు వాపోతున్నారు. వర్షాల కోసం ప్రజలు, రైతులు కోటికళ్లతో ఎదురుచూస్తున్నారు.

భూపరిపాలన అంశాలపై సమగ్ర పురోగతి సాధించాలి

అమలాపురం రూరల్: భూపరిపాలన అంశాలపై సమగ్ర పురోగతిని సాధించి సుపరిపాలన అందించే దిశగా ప్రభుత్వం ప్రతినెల భూ పరిపాలన రెవెన్యూ అంశాలపై సమీక్షిస్తోందని జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎస్ రాజకుమారి శనివారం తెలిపారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ప్రతినెల భూ పరిపాలన రెవెన్యూ అంశాలపై పురోగతి సాధించేలా ఆర్డీఓలు తాహసీల్దార్లతో క్షేత్రస్థాయి అంశాలపై ప్రతినెల ఆశించిన పురోగతిని తీసుకువచ్చేలా సమీక్షిస్తున్నట్టు ఆమె వెల్లడించారు. జీవో- 30 భూముల క్రమబద్ధీకరణ-2025, అందరికీ ఇళ్లు కార్యక్రమంలో పురోగతి, రెవెన్యూ మంత్రి వివిధ జిల్లా కలెక్టర్లకు పంపిన విజ్ఞాపనలు, పిటిషన్లపై తీసుకున్న చర్యల నివేదిక కాలానుగుణ నివేదికలు, నీటి వనరులపై ఇతర సాధారణ ఆదేశాలతో తీసుకున్న చర్యల నివేదికలు, జిల్లా స్థాయి పర్యవేక్షణ ఆడిట్ కమిటీ ద్వారా భూమి వినియోగంపై నివేదిక.పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల స్థితి లోకాయుక్తతో సహా, ఆడిట్ పేరాలు,క్రమశిక్షణా కేసుల విచారణ నివేదిక స్థితి, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, జాతీయ రహదారులు రైల్వే లైన్లపై భూసేకరణ పురోగతి నివే దిక, నీటి పన్ను వసూలు, భూదాన్ భూములు, సీనియారిటీ జాబితాల తుది నిర్ణయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జయలక్ష్మి, అదనపు కమిషనర్ ఎస్.ప్రభాకర్ రెడ్డి సూచించారని ఆర్డీఓ అన్నారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి

యానాం: పట్టణంలో తిరిగే ఆటో వాహనాల డ్రైవర్లు నిబంధనలు పాటించాలని, పోలీస్‌శాఖకు సహకరించాలని ట్రాఫిక్ ఎస్సై శేరు సూకరాజు పేర్కొన్నారు. శనివారం ట్రాఫిక్ స్టేషన్‌లో ఆటోడ్రైవర్లు, వాహనాల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆటోల్లో నిబంధనలకు మించి ప్రయాణికులను తరలించరాదని, వాహనాల ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయించుకోవాలని, డ్రంక్ అండ్ డ్రైవ్, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల తరలింపు వంటి చట్టవిరుద్ధ పనులకు పాల్పడితే చట్టప్రకారం చర్యలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు అభినందనీయం

అమలాపురం టౌన్: అల్లవరం మండలం ఓడలరేవు ప్రాంతంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలన్న చర్యలు అభినందనీయమని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. అమలాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. కోనసీమ అలాంటి కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తున్న ఎంపీ గంటి హరీష్ మాథూర్‌ను ఎమ్మెల్సీ అభినందించారు. ఓడలరేవు కేంద్రీయ విద్యాలయం కోసం రూ.3.30 కోట్ల మంజూరుతోపాటు 7.50 ఎకరాల భూసేకరణకు ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఆయన స్వాగతించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి త్రినాథరావు, దండుమేను రూపేష్, ముంగర ప్రసాద్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మవారికి వెండి చీర అలంకరణ


తాళ్లరేవు ముత్యాలమ్మవారికి వెండిచీరను సమర్పిస్తున్న దాత సూర్యనారాయణమూర్తి తదితరులు

తాళ్లరేవు: స్థానిక గ్రామదేవత ముత్యాలమ్మవారికి కేశవపురానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ అధికారి జొన్నలగడ్డ సూర్యనారాయణమూర్తి వెండి చీరను సమర్పించారు. రూ. 3 లక్షల వ్యయంతో తయారు చేయించిన వెండిచీరను శనివారం ఆలయ కమిటీ ప్రతినిధులకు సూర్యనారాయణమూర్తి అందజేసారు. ఈ సందర్భంగా వెండి చీరకు సంప్రోక్షణ నిర్వహించి అమ్మవారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు గంజా సూరిబాబు, వాసంశెట్టి శ్రీనివాస్, వనచర్ల చంద్రరావు, గుబ్బల శ్రీను, మర్ల ఫణిశర్మ, కొలను సత్యనారాయణమూర్తి, రామకృష్ణయ్య, సత్యవతి, సూర్యనారాయణమూర్తి, జొన్నలగడ్డ శ్రీనివాస్, వంక నాగమణి, చావలి రవి, మహాలక్ష్మి, యల్లమిల్లి సూరిబాబు, బొంతు శ్రీనివాస్, పినపోతు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కీచకులను కఠినంగా శిక్షించాలి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిద్ధూ తదితరులు

రామచంద్రపురం: కాకినాడ రంగారాయ మెడికల్ కాలేజీలో పారా మెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన నలుగురు కీచకులను వెంటనే సస్పెండ్ చేసి, కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ, పీవైఎల్ ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, పీవైఎల్ రాష్ట్ర నాయకుడు వి.భీమశంకర్, పలు ప్రజా సంఘాల నాయకులు శనివారం పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, విద్యార్థినులు రక్షణ లేని పరిస్థితుల్లో జీవిస్తున్నారన్నారు. పాఠశాలల నుంచి కళాశాలల వరకూ భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. లైంగిక వేధింపులు, మానభంగాలు, హత్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నా ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. 50 మంది వివిధ కాలేజీ విద్యార్థినులను అసభ్యంగా తాకిన ఘటన దారుణమన్నారు. ఇలాంటి దుర్మార్గపు చర్యలతో విద్యా వ్యవస్థ పరువు పోతుందన్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు


అంగరలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో తులాభారం వేస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు పర్యవేక్షణలోని అర్చక బృందం స్వామిని విశేషంగా అలంకరించారు. అంగర, పడమర ఖండ్రిక, కోరుమిల్లి, మాచర, తాతపూడి, వెదురుమూడి, నల్లూరు తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. విశాఖ పట్టణానికి చెందిన ఆచంట సత్యప్రసాద్, దుర్గాసత్య దంపతులు తమ ఐదు నెలల చిన్నారికి తులాభారం వేసి స్వామికి పటికను సమర్పించారు. ఆలయ నిర్వాహకులు, దాతల సహకారంతో దూరపు ప్రాంతాల భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

రచయిత్రి సుధకు తెలుగు వెలుగు పురస్కారం


రచయిత్రి సుధను ఎన్టీఆర్, పీవీ జాతీయ తెలుగు వెలుగు పురస్కారంతో సత్కరిస్తున్న ఆ సంస్థ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన రచయిత్రి పచ్చిగోళ్ల సుధకు తెలుగు వెలుగు జాతీయ పురస్కారం లభించింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా పనిచేస్తున్న జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ తెలుగు వెలుగు సాహితీ వేదిక సుధకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్), మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహరావు జయంతిని పురస్కరించుకుని తెలుగు వెలుగు సాహితీ వేదిక సమాజంలో తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్న 20 మందికి ఎన్టీఆర్, పీవీ పురస్కారాలు ప్రదానం చేసింది. హైదరాబాద్ నగరం చిక్కడపల్లిలోని త్యాగరాయ గాన సభలోని కళావెంకట దీక్షితులు కళావేదికపై శనివారం నిర్వహించిన పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో రచయిత్రి సుధ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక ప్రతినిధులు ఈ సందర్భంగా సుధను సత్కరించి పురస్కారాన్ని అందించి అభినందించారు.

కుళాయిల నుంచి కలుషిత జలాలు


చిందాడగరువు ప్రాజెక్ట్ నుంచి కుళాయిల ద్వారా వచ్చిన పసుపు రంగునీరు

అమలాపురం రూరల్: చిందాడ గురువు రక్షిత పథకం ద్వారా కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్లోరినేషన్ సక్రమంగా చేయడంలేదని ప్రజలు ఆరోపించారు. ప్రతిరోజు 14 గ్రామాల్లోని వేలాది మంది ప్రజలకు ఈ ప్రాజెక్ట్ దాహం తీర్చుతుంది. నీటిని శుద్ధి చేయడంలో ప్రమాణాలు పాటించడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా పసుపు రంగు నీరు కుళాయిల ద్వారా వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ఇటువంటి రంగు మారిన నీళ్లు రావడంపై ప్రజలు గగ్గోలు పెడుతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఈ ప్రాజెక్టు నిర్వహణకు ఏటా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఈ ప్రాజెక్ట్ నిర్వహణ సాగుతున్నప్పటికీ మంచినీటి నాణ్యత ప్రమాణాలు అంతగా పాటించడం లేదంటూ పలువురు అన్నారు. అధికారులు స్పందించి తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.